క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ జింఖానా ఫీడర్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా 28వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సీతన్నపేట్, బాపిస్ట్ పాలెం, పెజ్జోనిపేట్, హార్ట్‌పేట్, పప్పుల మిల్ రోడ్డు, పాల బజారు, ఫిల్మ్ గోడౌన్ స్ట్రీట్, పీటర్ స్ట్రీట్, నాడార్ స్ట్రీట్, వంగ సుందరావు వీధి, ఆర్‌సిఎం చర్చ్ ఏరియా, అల్లావుద్దీన్ స్ట్రీట్, డేవిడ్ స్ట్రీట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన



విజయవాడస్పోర్ట్స్: వాహన చోదకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనం నడపొద్దని ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. జిల్లా ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద హెల్మెట్, సీటుబెల్టు ధరించకుండా వాహనాలు నడిపే వారికి సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా వాహనం నడిపి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వాహన చోదకులకు అవగాహన కల్పించిన స్కూల్ విద్యార్థులను ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, సీఐ రవికుమార్, ఎస్ఐ జి.వి.ఎన్.కుమార్ అభినందించారు.

మిమిక్రీ కళాకారుడు అప్పాజీకి సత్కారం




మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణ సంక్రాంతి సంబరాల్లో నంది పురస్కారం అందుకున్న సందర్భంగా దేవీనగర్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శ్రీనివాస అప్పాజీని సోమవారం ఘనంగా సత్కరించారు. దేవీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ నేతలు జి.సాంబశివరావు, కె.వీరరాజు, జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రాంతానికి చెందిన శ్రీనివాస అప్పాజీకు నందిపురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. మిమిక్రీ కళాకారుడు శ్రీనివాస అప్పాజీ మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు కె.రఘురామ్, స్థానికులు పాల్గొన్నారు.

సాయినాథుడికి వెండి కిరీటం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం దాత నాగేశ్వరరావు దంపతులు, వారి కుమార్తె మౌనికసాయిలక్ష్మి కలిసి సాయిబాబావారికి రూ. 50వేలు విలువచేసే వెండికిరీటంను బహూకరించారు. ఈ మేరకు కిరీటాన్ని మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము తలపెట్టిన ప్రతీ అధ్యాత్మిక, సేవ కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహాయ సహకారం మరువలేనిదన్నారు. వెండికిరీటం అందజేసిన దాతలను అభినందించారు. దాతలతో కలిసి బాబావారికి వెండికిరీటం ధరింపచేసి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పికెల్‌బాల్ డబుల్స్ విన్నర్ గోపాలరావు, శ్రీకర్



విజయవాడస్పోర్ట్స్: హైదరాబాద్ ఓపెన్ పికెల్ బాల్ ర్యాకింగ్ డబుల్స్ ట్రోఫీని విజయవాడకు చెందిన కర్రి దోలగోపాలరావు, మోతుకూరి శ్రీకర్ సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కొంపల్లిలోని పికెల్‌బాల్ హబ్‌లో జరిగిన ఈ టోర్నీలో 35 ప్లస్ డబుల్స్ విభాగంలో గోపాలరావు, శ్రీకర్ పాల్గొని అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విన్నర్ టైటిల్ సాధించి విజయవాడ నగర కీర్తిప్రతిష్టలు పెంచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ పికెల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీధర్ అభినందించారు.

ఆహ్లాదం.. ఆవిరి..!

- నిర్లక్ష్యపు నీడలో గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం
- మౌలిక సదుపాయాలు కరువు



ఉద్యానవనంలో కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన నాపరాళ్లు



గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోటలోని గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనంలో ఆహ్లాదం ఆవిరయ్యింది. ఒకప్పుడు సువిశాలంగా ఆటపరికరాలు, పచ్చదనంతో ఉద్యానవనం ఆహ్లాదకరంగా ఉండేది. అయితే మధురానగర్ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా పక్కనే ఉన్న ఉద్యానవనంలోనికి చొచ్చుకువెళ్లి పనులు పూర్తిచేశారు. ఇందులో భాగంగా ఉద్యానవనంలోని పలు మొక్కలు పాడయ్యాయి. అలాగే ఆటపరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోవడంతో ఇక్కడ నుంచి తరలించారు. ప్రస్తుతం ఇక్కడ ఉద్యానవనం అధికారుల తీరుతో కళావిహీనంగా తయారయ్యింది. ఆర్‌యూబీ పనులు పూర్తయిన తర్వాత ఉద్యానవనంను పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దుతారని స్థానికులు ఆశించారు. కానీ నేడు ఆర్‌యూబీ ప్రారంభం అయ్యి ఏడాది కావస్తున్నా ఇక్కడ ఉద్యానవనాన్ని పట్టించుకున్న వారే కరువయ్యారు.

విషసర్పాల సంచారం

స్థానిక 31వ డివిజన్‌కు ఇది ఏకైక ఉద్యానవనం. ఈ ఉద్యానవనంలో పచ్చదనం పెంచి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆట పరికరాలు, జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సువిశాలంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఖాళీగా వదలి వేయడంతో ఇక్కడ కాంట్రాక్టర్ నాపరాళ్లను వేసుకుని వాడుకుంటున్నారు. ఉద్యానవనం చుట్టూ తుప్పలు, రైల్వే ట్రాక్ ఉండటంతో విషసర్పాల సంచారం అధికంగా ఉంది. కావున ఈ ప్రాంతంలో చెత్తచెదారం తొలగించి శుభ్రం చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఉద్యానవనంను అభివృద్ధి చేసి 31వ డివిజన్ వాసుల ఆహ్లాదానికి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో బల్లలు

ఉద్యానవనంలో ప్రజలు కూర్చునేందుకు అవసరమైన బల్లలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఉద్యానవనంకు వచ్చే ప్రజలు శిథిలమై ఒరిగిపోయి చువ్వలు బయటకు వచ్చిన బల్లల పైనే కూర్చుంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యానవనంలో చాలా వరకు నిరుపయోగంగా ఉంది. ఆర్‌యూబీ పనుల్లో భాగంగా పచ్చదనం తొలగించిన ప్రాంతంలో మొక్కలు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



విరిగిపోయి నిరుపయోగంగా సిమెంట్ బల్లలు

మలుపుల్లోనే అత్యధిక ప్రమాదాలు

ఎంవీఐ పద్మాకర్



ప్రమాద రహిత డ్రైవర్‌లను సన్మానించి సర్టిఫికెట్‌లు అందజేసిన ఎంవీఐ పద్మాకర్

విజయవాడస్పోర్ట్స్: రోడ్ల మలుపుల్లోనే 75శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వి.పద్మాకర్ వెల్లడించారు. మలుపుల్లో వాహన వేగాన్ని తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని డ్రైవర్లకు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటోనగర్ బస్ డిపో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఆటోనగర్ బస్ డిపో వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పద్మాకర్ మాట్లాడుతూ వాహనం నడిపేప్పుడు డ్రైవర్లు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. రోడ్డు మలుపులో వాహనాన్ని వేగంగా నడిపితే, ఆ సమయంలో ఎదురుగా వచ్చే వాహన మార్గాన్ని అంచనా వేయడం సాధ్యపడదన్నారు. ఈసందర్భంలో డ్రైవర్ మైండ్ త్వరగా రియాక్ట్ కాదని, వాహనాన్ని ఏ మార్గంలో పోనివ్వాలో అర్థంకాక ఏటూ తేల్చుకోలేని పరిస్థితిలో బ్రేక్‌పై కాలు పడదని వివరించారు. ప్రస్తుతం జరిగే రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మలుపుల్లోనే జరుగుతున్నట్లు తెలిపారు. రోడ్డు మలుపుల వద్ద ముందుగా వెళ్లే వాహనాన్ని ఓవర్ టేక్ చేసేందుకు అస్సలు ప్రయత్నించొద్దని హెచ్చరించారు. ఇయర్ ఫోన్లు పెట్టుకుని వాహనాన్ని నడపరాదన్నారు. డివైడర్‌లు లేని ప్రాంతాల్లో వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ముందున్న వాహనానికి 50 మీటర్ల దూరం తప్పనిసరిగా పాటించాలన్నారు. రహదారి భద్రత నియమాలు ఖచ్చితంగా పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదరహిత డ్రైవర్లుగా మొదటి మూడుస్థానాల్లో నిలిచిన సిహెచ్.ఎస్.రావు, ఎం.ఎస్.రెడ్డి, ఎస్‌కె.షరీఫ్‌లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్, రోడ్డు సేఫ్టీ ఎస్ఐ త్రిమూర్తులు, ఫైర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ, హోండా రోడ్డు సేఫ్టీ కోఆర్డినేటర్ వెంకటదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆహ్వాన నాటకోత్సవాలు ప్రారంభం



'గురితప్పిన వేట' నాటకంలోని ఓ సన్నివేశం



'మూల్యం'నాటికలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఏపీ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో మూడురోజులపాటు నిర్వహించనున్న 8వ ఆహ్వాన నాటకోత్సవాలు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలినాటక ప్రదర్శనగా వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించిన 'గురితప్పిన వేట' రెండో ప్రదర్శనగా డాక్టర్ వెంకట్‌గోవాడ దర్శకత్వం వహించిన 'మూల్యం' నాటికను ప్రదర్శించారు. సినీనిర్మాత ఎస్.మల్లికారెడ్డి జ్యోతిని వెలిగించి ఈ నాటకోత్సవాలను ప్రారంభించారు. పారిశ్రామికవేత్త అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆయారంగాలకు చెందిన వేముల హజరత్తయ్యగుప్తా, డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య, దొంతాల ప్రకాష్, బొర్రా నరేన్, ఉన్నవ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. నాటకోత్సవాలలో భాగంగా జానపదగాయని డాక్టర్ అరుణా సుబ్బారావును ఘనంగా సత్కరించారు.



డాక్టర్ అరుణా సుబ్బారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



కథా సంకలనం పరిచయసభలో ఇంతియాజ్, గోళ్ళ నారాయణరావు, శాంతిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని, అదే కాలానికి నిలుస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎఎండీ ఇంతియాజ్ అన్నారు. సమన్విత సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో సోమవారం యోధ కథా సంకలన పరిచయ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ కవులు రచయితలు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. యోధ కథా సంపుటిలోని కథలు వాస్తవ జీవితాలకు అద్దం పట్టాయన్నారు. రచయిత్రి దుట్టా శమంతకమణి సంకలనంలోని రచయిత్రుల కృషిని అభినందించారు. నేటిసమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షత, స్త్రీ కేవలం విలాసవస్తువుకాదన్న సందేశాన్ని ఆయా రచనల్లో వివరించారని పేర్కొన్నారు. సమావేశంలో సాహితీ ప్రముఖులు గోళ్ళ నారాయణరావు, చలపాక ప్రకాష్,అరసవల్లి కృష్ణ, కోపూరి పుష్పాదేవి, అనిల్ డ్యానీ, వడ్లమూడి పద్మ, శాంతిశ్రీ కే ఉషారాణి కథా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీ ప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం జరిగితే ఉద్యమం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ నియమించనున్న పోస్టులలో ఇప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న సీనియర్ పారిశుద్ధ్య కార్మికులను తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షుడు ఎస్వీ చలం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లగా అత్యవసర పరిస్థితుల్లో (కోవిడ్, వరదలు, భవానీ దీక్షలు) దాదాపు 60 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించుకున్నారని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల నియామకంలో రాజకీయాలు చేయడం బాధాకరమని చెప్పారు. నగరపాలక సంస్థ అదనంగా తీసుకుంటున్న పోస్టుల్లో సీనియార్టీ ప్రకారం తీసుకోవాలని, లేని పక్షంలో ఏఐటీయుసీగా ఉద్యమం చేస్తామని తెలిపారు. అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తక్షణం రాజకీయాలు మానుకుని కష్టపడే కార్మికులకు కొత్త పోస్టులలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు దారా రాంబాబు, తుపాకుల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషియన్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న అసోసియేషన్ నగర అధ్యక్షుడు కె.శ్రీహరిరావు



రక్తదానం చేస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దివిజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నేషనల్ ఎలక్ట్రిషియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డీవీ సత్యనారాయణ హాజరై థామస్ అల్వా ఎడిషన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిషన్ బల్బును కనిపెట్టిన రోజును తాము జాతీయ ఎలక్ట్రిషియన్ డేగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అసోసియేషన్ నగర అధ్యక్షులు కె శ్రీహరిరావు మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా కలిసి మెలసి ఉండాలని, అసోసియేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వై.శంకర్‌రావు, గౌరవ సలహాదారు కె.బుజ్జి ప్రసంగించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ..

జాతీయ ఎలక్ట్రిషియన్‌డే పురస్కరించుకుని ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. మాక్స్‌విజన్ కంటి వైద్యులు పాల్గొని వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా పలువురు ఎలక్ట్రిషియన్లు రక్తదానం చేశారు. అదేవిధంగా చుట్టుగుంట బుజ్జి ఎలక్ట్రికల్స్ వద్ద నగర అధ్యక్షులు కె శ్రీహరిరావు అసోసియేషన్ జెండాను ఎగురవేశారు. కె వెంకట్, బుజ్జి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఐసీసీఎం వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఏసుక్రీస్తు పరిశుద్ధ ప్రార్థన మందిరంలో ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్‌మైటీ లార్డ్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన దైవజనులు కోట కరుణ్‌కుమార్, తుమ్మల సత్యం మాట్లాడుతూ క్రైస్తవులు సంఘటితంగా ఉండి అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్, డానియేల్, బాలా, మోహన్‌కుమార్, జెకర్యా, ప్రేమ్‌కుమార్, సంతోష్ కుమార్, సందీప్, నేహమ్యా, శ్యాంసన్, సత్యానందం, శామ్యూల్ పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు.

కలంకారీపై పీహెచ్‌డీ చేసిన లీలావతికి కలెక్టర్ ప్రశంస



డాక్టరేట్‌ను కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీకి చూపుతున్న లీలావతి

చిలకలపూడి(మచిలీపట్నం): కలంకారీలో పీహెచ్‌డీ చేసిన విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ పామర్తి లీలావతిని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ప్రశంసించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను లీలావతి మర్యాద పూర్వకంగా కలిశారు. కృష్ణాజిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కలంకారీపై డాక్టరేట్ చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఐదేళ్ల పాటు కృషి చేసిన ఫలితంగా కలంకారీలో పీహెచ్‌డీ వచ్చిందన్నారు. సొంత జిల్లాలో కలంకారీపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకోవటం హర్షదాయకమన్నారు. ఏపీలో కృష్ణా జిల్లా కలంకారీ పరిశ్రమ దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచిందన్నారు. అటువంటి కలంకారీపై డాక్టరేట్ చేయటం అభినందించదగ్గ విషయమన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, రిటైర్డ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ విక్టర్‌పాల్ తదితరులు ఉన్నారు.


ప్రజాపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయలు ప్రజారంజక పాలనను నేటి ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు కళాపీఠం, తెలుగు కళావాహిని, క్రామేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితి సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికలో సోమవారం శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా గుప్తా మాట్లాడుతూ దేవరాయలు ప్రజాపాలకుడేగాక సాహితీవేత్త పేరొందారని కొనియాడారు. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలోని దేవాయాలన్ని సందర్శించారని నాటి శాసనాలు చెబుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలు కళాపీఠం గౌరవ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రహమణ్యం, అధ్యక్షుడు నెరసు సీతారామయ్య, ఉపాధ్యక్షుడు గొట్టుపల్లి నాగఉమామహేశ్వరరావు, ప్రధానకార్యదర్శి తుపాకుల మహేష్‌కుమార్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. గాయనీగాయకులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

వ్యాసరచన పోటీలో సిద్ధార్థ విద్యార్థులకు బహుమతులు



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఈ నెల 23వ తేదీన ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ఆవరణలో సోమవారం అభినందించారు. రమేష్ మాట్లాడుతూ డేటా సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్న రామవరపు శ్రవంతి వ్యాసరచనలో, పి.హనిత వకృత్వ పోటీల్లో రెండో బహుమతిని సొంతం చేసుకున్నారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, డేటా సైన్స్ విభాగాధిపతి ఉదయశ్రీ, అధ్యాపకులు ఎం.వెంకటరమణతో పాటుగా విద్యార్థులు అభినందించారు.

గోతులను పూడ్చరూ!



పబ్లిక్ స్కూల్ సమీపంలో బుడమేరు కట్టపై ప్రమాదకరంగా మారిన గుంతలు

అయోధ్యనగర్ సూర్య పబ్లిక్ స్కూల్ బుడమేరు కట్టమీద తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. బుడమేరు వరదల సమయంలో కట్టమీద గోతులు తవ్వి వరద నివారణ చర్యలు చేపట్టారు. వరద తగ్గిపోయి నాలుగునెలలు గడిచినప్పటికీ ఆ గోతులను ఇప్పటివరకు పూడ్చలేదు. దీంతో ఆయా గోతుల్లోపడి పలువురు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆయా గోతులను పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు. - మధురానగర్ (విజయవాడసెంట్రల్)

పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



లబ్బీపేట (విజయవాడ తూర్పు): చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులకు డాక్టర్ కెఎస్ఎస్ ప్రసాద్ ఫౌండేషన్, మాంటిస్సోరి పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎన్టీఆర్ కాలనీలోని మలినేని నాగేశ్వరరావు లైబ్రరీ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 96 మంది విద్యార్థులకు రూ.11.60 లక్షలు ప్రోత్సాహకాలు అందచేశారు. అందులో డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్ తరపున రూ.6 లక్షలు, మాంటిస్సోరి పూర్వ విద్యార్థుల ఫౌండేషన్ రూ.5.60 లక్షలు ఇంటర్మీడియెట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్‌లు కిలారు స్వప్న, వీరమాచినేని రంగప్రసాద్ మాట్లాడుతూ ఈచ్ వన్ హెల్ప్ వన్ అనే ఆశయంలో డాక్టర్ కెఎస్ఎన్ ప్రసాద్ 2004లో రూ.1.25 కోట్లు మూలధనంతో ఫౌండేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అదే ఆశయంలో మాంటిస్సోరి స్కూల్‌లో చదివిన మిత్రులు రూ.1.10 కోట్లు మూలధనాన్ని సమీకరించినట్లు పేర్కొన్నారు. వాటి నుంచి ఏటా స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.